# ఆకుపచ్చ నవ్వు

కార్తీకమాసపు రాత్రి. కలికి గాందారి మాందారి యాల్ల...

లింగంకు నిద్రపడుతలేదు. లేచి కూసున్నడు. పక్కకున్న మంగను ఊపి 'ఔ... పోదామా...' అన్నడు.

మంగ సప్పుడు జెయ్యలేదు. అట్లనే ముడుసుక పన్నది.

తలుపు తెరిచి బయటకచ్చిండు లింగం. సల్లటి గాలికి పెయ్యి జిలజిలమంది. పైకి చూసిండు. పట్టెమంచం నెత్తిమీదకచ్చింది. పాణం దస్సుమంది. బొంబాయి బస్సు తెల్లారనియ్యది.

'అరె తెల్లారిపోతుందే' అనుకుని సరసర ఇంట్లకు నడిచిండు. గొంగడిని మలిచి కొప్పెర పెట్టుకున్నడు. టార్చిలైటును గుతుప కట్టెను పట్టుకున్నడు. 'ఔ... లెవ్వవా.. పోదాం పా... " అన్నడు లింగం.

మంగ నిద్రపోలేదు. మేల్కతోనే ఉంది. అయినా మాట్లాడలేదు.

లింగంకు కోపమచ్చింది. అయినా తమాయించుకున్నడు. గొంతు పెంచి ఎక్కసంగా 'ఓ... రేపటినుంచి మా పందుపులెవ్వ పొద్దు పొడిచేదాక... మొద్దులెక్క అవ్వగారింటికి పోతవు గదా' అన్నడు. మంగ మాటలేదు పలుకులేదు.

లింగంకు ఓపిక నశించింది. అయినా తొందరపడలేదు. తొందరపడితే అయ్యేపని గాదని తెలుసు. బుదురకియ్యాలని 'లెవ్వు లెవ్వు... ఎండిన కర్రకు నీళ్ళు వెడితే ఎంతో పున్నెం. మల్ల ఈ దినం వారకు కొడుకు వుడుతడు లెవ్వు. చేసిన పున్నెం వట్టిగ పోతదా...'' అన్నడు దగ్గరికచ్చి.

మంగ గయ్యిమంది 'నీ బిత్తిరిల్లు మునుగ.... పండు. యాడికివోతవు... ఇల్లెల్లగొట్టంగ దొంతులు సదిరినట్టు... వద్దురా అని నిన్ను ఎప్పుడో పీకేసిరి. ఇగ నీకేంపట్టి. వద్లు వాగుల పోతేంది... గడ్డి గాదుపుల పోతేంది... అదంత ఎల్లుగాడే సూసుకుంటడు' అన్నది పక్క బొర్రియ్యకనే.

ఎల్లయ్య పేరు వినంగనే లింగంకు కోపం ఆగలేదు. 'ఎల్లుగాని కెరుకనాసుల్లి... వాడు మంచోడైతే ఇప్పటికే కల్లాలు లేసు. అప్పుడేమో నేను పారిత్త. నాట్లేసుకోండ్రి అని మీసాలు తీడే. ఇప్పుడు ఇంట్ల ఎల్లెనుకల పండె...."

అతని మాటలు ఆగకముందే అందుకుంది మంగ..

"ఆ...... సాలు తియ్యి. తలకు పాశిన ఎంటికె. ఏరేవున పోతేంది. వాళ్ళు వాళ్ళు గంగల గలువని మానెట్ల తేలని. ఏనాడు మనం దొంగలమైనమో ఆనాడే దూరమైనము. ఊరికి జేసిన ఉపకారమట. పీనుక్కు జేసిన సింగారమట... ఎవ్వి అక్కెరకురావు సక్కెరకురావు'' అన్నది యాష్టగా.

చిమాన జీకటి. ఒకల మొఖాలు ఒకలకు కనవడుతలెవ్వు. మంగ మాటలకు లింగం అరికాలిమంట పుర్రెకెక్కింది. చీకట్లో కనవడలేదుగనీ ఆ మొకంలోని కోపాన్ని చూస్తే దడుసుకునేదే మంగ.

చేతులున్న గుతుపకట్టెను గట్టిగ నేలకుగొట్టి ముందుకు నడుస్తూ "ఓట్.. నీ యవ్వ... రాకపోతే రాకపోతివి పండు.... మూరెడు పెరుగుతవు... నువ్వచ్చి నాకేం మావులు జేత్తవని గాదు. ... నాలెతూముల లైటు పడుతవని అంతే! నీది మందులకు గావాలంటే చింత చెట్టెక్కి చిల్లిచ్చి పోసినట్టు జెయ్యవడితివి... రాకు...'' అన్నడు లింగం. అనుకుంటనే తలుపు తీసి బయటకు నడిచిండు.

మంగకు పానం ఆగలేదు. 'ఈ పిచ్చోనితోని ఎట్ల... ఇడవబోయి మూడు ముల్లేసు కుంటడు. అసలే తైబందు. నీటి సుక్కముడితే దండుగు జురుమానంటరు... ఊరంత ఉసికె ఉడికినట్టు ఉడుకుతుంది. ఒగల మీద ఒగలు కావలిగాత్తండ్రు.... ఎవలన్న జూసిరే... చెరువుల మలిసి పెడుతరు... ఎట్లగతీ...' అనుకుంట లేచి దబదబ అడుగులేసి మొగన్ని అందుకుని, ఎనక

నుంచి గొంగడి పట్టి ఆపింది. ఆపి 'తెల్లారితే బతుకవోతున్నవు. నీకెందుకు?' అన్నది.

లింగం చెలుపరిచ్చి ముందుకు నడిచి ఆగిండు.

మంగ వద్దే వద్దన్నది. వట్టిగ బదునామైతమన్నది. లింగం ఆగనే ఆగనన్నడు. నువ్వు వత్తెరా... లేకుంటె లేదన్నడు. అనుకుంట నడుత్తనే ఉన్నడు.

మంగకు కోపం ఆగుతలేదు. తిడుదామంటే నడిబజారు. ఎవలన్నా లేచి సూత్తరేమో అనిపించింది. 'నీ పిచ్చి తలపండు వలుగ. తెలువనోనివి గాదు... తెలిసినోవిగాదు... నీతోని ఇదే ఏడ్సుడాయె..." అన్నది చిన్నగా.

లింగం ఎనుకకు మర్లలేదు. పోతనే ఉన్నడు.

'పోతే పోనీ సావనీ... నేను ఇంట్లకు పోత' అనుకుంది మంగ. కానీ పాణం దరించలేదు. నాలె తూము యాదికచ్చి పానం జల్లుమంది. కొత్తలో ఒకసారి తూమును ఇప్పేటప్పుడు చూసింది. పట్టపగలే చిమాన చీకటి. ఏదుకొయ్యలు. జారుడు బండల తావు.

దబదబ చీరెశింగులు కిందికి గుంజి గోశి ఎగజెక్కుకుంది. కొంగును గుంజి నెత్తిమీద కప్పుకుంది. 'నీ మొద్దిల్లు మునుగ... నా గోసపుచ్చుకోవడితివి... అక్కడ ఎవడన్న సూత్తె బొక్కలిరుగ దంతడు పా...అప్పుడు నీ తీటవాత్తది... " అని పండ్లు గొరుక్కుంట ముందుకు నడిచింది మంగ.

ఊరంతా సలికి ఒదిగిపోయింది. ఎక్కడనో ఊరకుక్క సోకం. గట్టుమీద నెమళ్ళ అరుపు. మడికట్లల్ల నక్కల ఊల. నిద్రలో నడుస్తున్నట్టు అడుగులేత్తంది మంగ. ఎంత తర్కించుకున్న లింగం అంతరంగమేమిటో అర్థం కావడం లేదు. ఎందుకింత ఆరాటం అనుకుంటుంది. ఆ ఆలోచనలతోనే ఊరు దాటింది.

కన్నుపొడుసుకున్నా కనవడని చీకటి. ఊరు దాటేవరకున్న కరెంటు లైటు ఈ చీకటిని ఎక్కువ జేస్తుంది. దారిపొడుగునా చిమ్మట్ల రొద. లైటు పురుగుల మెరుపు.పతుకులాడుకుంట నడుస్తూ కాసువాగ ఒర్రెను దాటిండు లింగం. గులుక్కుంట ఎంబడి మంగ.

ఇద్దరూ పిల్లతొవ్వన మలిగి సీతబోరు తిరిగింర్రు. వాడిపోయిన పైరు వాసన గుండెను మెలితిప్పింది. పంటకాలువలు ఎండి కాళ్ళ కింద ఇసుక కర్రుకర్రుమంటుంది. ఏండ్లుగా అలువాటైన తొవ్వ. కాళ్ళు అవే సాగుతున్నయి.

గొంగడి ముడుచుకున్న లింగం, కొంగును ముడుచుకున్న మంగ చీకట్లో కలిసి నడుస్తున్నరు.

చీకటికి అలవాటై కండ్లు కొద్దిగ తేటవారి నయి. ఒకలకొకలు మసగ్గా కనవడుతున్నరు. తాటిబోదెలను దాటి అడ్డం వచ్చిన పొదలను తప్పుకుంటూ బండకింద బోరు ఎక్కిండ్రు. 'ఎప్పుడు నీటి స్పర్శను ఈ కాళ్ళు చూస్తయో' అని ఉరుకులు పరుగుల మీద లింగం నడుత్తుంటే 'ఎప్పుడేమైతదో ఎవలు సూత్తరో... ఎందుకంటే ఇయ్యల్లగాకున్న రేపైనా ఎరుకైతది...' అన్నభయంతో మంగ నడుత్తంది.

కత్తెర పొదలు కాళ్ళను చీరుతున్నయి. ఉత్తరేణి గింజలు కాళ్లను గీరుతున్నయి. లింగంకు గొంగడి అడ్డంగా ఉంది. మంగకు మాత్రం ఉత్త కాళ్లే. గీరినప్పుడల్లా మంటపుడుతుంది. మండినప్పుడల్లా మాటలంటుంది. గట్టిగా అనకుండా పండ్లు కొరుక్కుంటూ గులుగుతుంది.

కొత్త మల్లన్న గుట్టను దాటి ఇద్దరూ కట్టుగాలువ కట్ట ఎక్కిండ్రు. చేతుల లైటున్నా పడుతలేదు లింగం. కాలువ లోతును నీళ్ళను పట్టిపట్టి సూత్తూ నడుత్తుండు.

ఎంట నడుత్తున్న మంగ నోరు ఇప్పింది 'కాలువ పాడుగాను. మంచిగనే పారుతుంది గదా. మడుగుల గూడా మంచిగనే ఉండెనీళ్ళు... కాసువాగ కాలువ ఎందుకిడువరట...' అడిగింది.

నీళ్ళ ముచ్చట తప్ప మరో ముచ్చటకైతే నోరు విప్పకపోతుండె లింగం. పంటనీళ్ళ ముచ్చట కాబట్టి కాలు ఆపి ఎనక్కి తిరిగిండు. మురుసు కుంట 'తైబందే... తైబందు జేసిండ్రు. కాసు వాగ పారాలంటే నాలెతూము ఇడువాలె. నాలె తూము ఇడిత్తే నీళ్ళన్నీ వట్టిగపోతయి. మిగతా కాలువలకు ఎక్కయి. అంగాము ఉన్నప్పుడు వేరు. కరువు నీళ్ళాయె. అందుకే నాలె తూము మెత్తి కాసువాగ చేనును నాటు పెట్టద్దన్నరు' చెప్పిండు.

'మరి నాటెందుకు పెట్టిండ్రు...? అడిగింది మంగ.

తుకాల మీద జాలు నీళ్ళచ్చినయి. ఒకలను చూసుకుంట ఒకలు ఊట నీళ్ళకు నాటు పెట్టిండ్రు. ఎల్లుగాడు 'ఏసుకోండ్రి నేను పారిత్త' అన్నడు.

'మరి ఎందుకు పారిత్త లేదు'

'ఎట్ల పారిత్తడు. తూము ముడితే తూముల తొక్కుతానంటున్నరు. రైతులు గూడా సాలిచ్చుకున్నరు. ఎండిపోతే ఎండిపోనీ అనుకుంటున్నరు' చెప్పిండు లింగం.

మంగకు సు(శ్రు)మన్నది 'వెయిలకు వెయిలు లాగోడికి ఎరువులకు ఖర్చుపెట్టిన రైతులు ఎండిపోనీ అనుకుంటున్నరు. పసలు పసలుకు జీతం తీసుకునే నీరటి తూమును ముదుతలేదు. ఎంగిలాకు లెక్క ఇసిరి పడేత్తే పక్కకున్నోనివి నువ్వెందుకు తండ్లాడుతున్నవు' అడిగింది మంగ.

లింగం నవ్వలేదు. అలాగని సమాధానం చెప్పకుండా దాటెయ్యలేదు. కాలు ఆపి మంగతో కూడా నడుస్తూ "అవునే... తండ్లాటనే... అది చెప్పినా నీకు అర్థంకాదు. అయినా నీకూ ఎక్కడో ఆ వరి మడ్ల మీద ప్రేమ లేనిది నావెంట ఎందుకస్తవే...'అంటూ దబదబ అడుగులేసి ముందట పడ్డడు.

మంగ ఏదో గెలుకుతుంది. లింగం మాట్లాడుతలేదు. పేనెం మదుగు కట్టమీదికి పోయి ఆగింద్రు ఇద్దరు. మదుగుకు నాలుగు కాలువలు. నాలుగూర్ల పారుకం. వచ్చే నీళ్ళు వత్తున్నయి. పోయే నీళ్ళు పోతున్నయి. పొదల్లో జంతువులు, నీళ్ళలో పిట్టలు చేసే చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. నాలె తూము దగ్గెరికి దారితీసిండు లింగం. ఏమీ అడుగకుంటనే ఎంట నడిచింది మంగ.

కట్టమీద ఎవరన్నా ఉన్నారెమోనని చూసిండు లింగం. చీకట్లో ఏమీ కనిపించలేదు. 'ఇప్పుడెవలన్న దొరుకవడితె సంపనే సంపుతరు అనుకుంది... ఎట్లా... జెట్టన బయటపడాలె' అనుకుంది మంగ. ఇద్దరూ కట్టదిగి నాలె తూము ముందుకచ్చింద్రు.

తూమును సందులేకుంట మెత్తినట్టున్నరు. సుక్క నీళ్ళు బయటకు రావడం లేదు. సన్నటి ఊట రాళ్ళ పక్క నుంచి జారుతుంది. తూము లోపల ఎక్కడో సన్నగా నీటి చప్పుడు.

గొంగడిని పక్కకు పెట్టిండు లింగం. గోశి బలిచ్చిండు. లైటును మంగకిచ్చిండు. నాలె తూముల సొచ్చిండు. వంగిపోతే ఒక మనిషి మాత్రమే నడువచ్చే ఎలుమున్న గొలుసుపెట్టు తూము.

ముందు లింగం. ఎనుకలైటు పట్టుకుని మంగ. అడుగులో అడుగేత్తున్నరు. కింద కప్ప చితుకుల నీళ్ళు. పాకురువట్టి జారుతున్న బొడిగె రాళ్ళు. చిన్న చిన్న గుంటలు.

లోపల వెలుగుపడేసరికి గోడలను, బండలను, నీళ్ళను అంటిపెట్టుకున్న జీవులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డయి. ఎక్కడియక్కడ ఉరుకందుకున్నయి. గబ్బిలాలు మొఖానికి అడ్డంగా తిరుగుతున్నయి.

కట్టెతోని పొడుసుకుంట జారుతున్న రాళ్లల్ల నిలదొక్కుకుంట వంగి వంగి నడుత్తండు లింగం. కాళ్లకింద చాపలు కప్పలు నలుగుతున్నయి. నీరుగట్టెలు అడ్డంగా తిరుగుతున్నయి. అతని అడుగులో అడుగేసి నడుత్తంది మంగ. డంగు సున్నం రాళ్లతో కట్టకు అడ్డంగా కట్టిన తూము. పగుళ్లలో పెరిగిన మొక్కలు, మొక్కలకు సుట్టుకున్న బూజు మోఖాలకు తలుగుతున్నయి.

"ఏమన్నా పాములు గట్ల ఉంటయా? ముండ్లు పయిలం. ... ఏదు కొయ్యిలుంటయి. ఏం పని పాడయింది. ఎవలు మెచ్చని పని...ఇక్కడ మనం సచ్చినా ఎవలూ పాపమనరు. మంచిగ సచ్చింద్రు అంటరు" గుసగుసగా అన్నది మంగ.

"పాములుండయి తేల్లుండయి. లైటు మంచిగ పట్టుకో... నేను తూమును తవ్వుత..." అంటూ నడిచిండు లింగం. లైటు వెలుగు అడుగు దూరం మాత్రమే పడుతుంది. లోపలికి పోతుంటే ముక్క ముక్కవాసన. తట్టుకోలేక రెండు మూడుసార్లు తుమ్మింది మంగ. లింగం ముక్కును నలుసుకున్నడు.

అనుకోకుండా కాలుకింద మెత్తగా తగిలింది మంగకు. లైటుకొట్టి చూస్తే పాము. నిలువునా లేచి మోకాలుకు చుట్టుకుంది. కెవ్వుమని కేకపెట్టింది మంగ. ఎనక్కి ఉరుకబోయి కాలుజారి అడ్డంబడ్డది. చేతులున్న లైటు ఎక్కడనో జారిపోయింది. గాజులు పలిగి గీరుకపోయినయి.

లింగంకు గుండె జల్లుమంది. ఎక్కువ మాట్లాడుదామన్నా భయం. ఎనక్కి తిరిగి ఫునుక్కుంటూ మంగను లేపిండు. 'పాము.... పాము' అని కలువరిత్తంది మంగ. చిమాన చీకటి. లైటు కోసం చేతులతో వెతికిండు లింగం. చల్లటి నీళ్ళు, రాళ్లు తప్ప లైటు దొరుకలేదు.

మంగను అదిమి పట్టుకున్నడు లింగం. మంగ భయంతో ఒదిగిపోయింది. 'దెబ్బతాకిందా...." గుసగుసగా అడిగిండు. మంగ 'లేదు' అంది.

'లైటును సూడు...' తూము దగ్గెర కట్టెలు రాళ్ళు గడ్డి ఉంటది. లైటు లేకుంటే తియ్యరాదు. ఇంక కొద్దిగ సేపైతే పని అయిపోతది పోదాం..." అన్నడు లింగం.

మంగ గులుగుతూ చేతులతో లైటు వెదికింది. దొరుకలేదు. ఆ రాళ్ళు నీళ్ళల్ల లైటును దేవులాడుడు ఉత్తపనేనని తెలిసిపోయింది. లైటు లేకుండా పనికాదని కూడా తెలిసిపోయింది.

ఆలోచనల్లో పడ్డాడు లింగం. అంతదూరం వచ్చి వట్టిగ పోవాలంటే మనుసు ఒప్పుత లేదు. వెంటనే లేచి వంగుకుంట బయిటకచ్చిండు. ఎండిన ఈతకమ్మలను గుంజిండు. జేబుల అగ్గిపెట్టెను తీసిండు. అంటువెట్టి దీటివట్టిండు. కమ్మలను నీటి తడి అంటకుంట మంగకు ఇచ్చిండు. ఏ మాత్రం లేటు జెయ్యకుంట తూము దగ్గెరికి నడిచిండు.

యుద్ధంలో చావు తప్పదనుకున్న సైనికునిలోని తెగువ కనిపించింది లింగంలో. రాళ్ళను తాటిపట్టీలను వరిగడ్డిని అడ్డంగా పెట్టిన తూమును కట్టెతో గెలికిచ్చిండు. ఒక రంధ్రం పడుడే కష్టమయింది. రంధ్రం తర్వాత వరిగడ్డిని గెలుకుతుంటే మడుగులోంచి తూములకు నీళ్ళు పడి పడీ దుంకినయి.

నిమిషాల్లో అక్కడ సప్పడే మారిపోయింది.ఇంతకింతకు కాలువ పొంగింది. బుయ్యిమని తూము సప్పుడు. అప్పటికి మంగ చేతుల్లోని ఈతకమ్మలు కాలిపోయినయి. పడుతూ లేత్తూ మోచేతులు మోకాళ్ళకు రక్తాలు అద్దుకుంటూ ఇద్దరు బయటకచ్చిండ్రు.

బయట గొంగడి లేదు. నీళ్ళకు ఎటో కొట్టుకపోయింది. ఇద్దరు తడిసి ముద్దయిండ్రు. సలికి వణికిపోతున్నరు.

'వెళ్దామా... బస్సుకు టయిమయితది' అన్నది మంగ.

'ఇంత కష్టపడి ఇడిసిన నీళ్లను అగాదం జేసిపోదామా... గలుమలు గట్టిపోదాం... లేకుంటే పారినయి పారుతయి... ఎండినయి ఎండుతయి...' అన్నడు లింగం.

"నీకేమన్నాపిచ్చా..... ఎవలన్న జూస్తే ఇరుగ దంతరు. బొంబాయి గాడి గాదు. పాడె ఎక్కుతవు. లింగం వినలేదు. యాష్టగా అన్నది మంగ.

మల్లన్న బోరు మీది నుంచి తాటిపాముల గుట్ట ఎక్కి మైలాన్‌దేవుని బండ పక్కనుండి అడ్డంగా కాసువాగలకు దిగిండ్రు ఇద్దరు. మంగ తడి బట్టలతో సలికి వనికిపోతుంది. మోకాలుకు మోచేతికి అయిన గాయాలు సలుపుతున్నయి.

'నీ పనిల మన్నువడ... ఉచ్చెతార్థంగా గొంగడి వాయె' తిట్టింది మంగ.

'బంగారమసొంటి లైటు... మస్కట్‌ది... ఆ మాలు ఇప్పుడు దొరుకనే దొరుకది' నవ్విండు లింగం.

ఇద్దరు కాసువాగ పారుకం కాలువలకు దిగిండ్రు. అప్పుడప్పుడే కాలువ అందుతుంది. పలుచగా నీళ్ళు. నీళ్ళు కాళ్ళకు తగిలేసరికి పాణం జలజలమంది లింగంకు. ఏదో యాదికచ్చింది.

"పదేండ్ల పొద్దు ఇదే కాలువకు నీరటి తనం జేసిన్నే..... పన్నెండేండ్ల పిల్లగానప్పుడు మా నాయిన ఈ కాలువ మీదనే పాముగరిచి సచ్చిపోయిండు. అప్పటి నుంచి నేనే నీరటిని. ఒద్దు ఒద్దు తెలుసు. మీ నాయిన సూడచ్చినప్పుడు నేను ఇక్కడనే ఉన్న.నలుపై రెండెంకురాలుంటది. పన్నెండు గలుమలున్నయి...."

చల్లటి నీళ్ళూ ఇసుకా కలిసిన కాలువను తొక్కుతూ ఊకొడుతుంది మంగ. క్షణాల్లో కాలువ ఉబ్బింది. మోకాలు మంటి నీళ్ళు. ఎండి పోయిన ఎండ్రికాయ పొక్కల్ల బొలబొలమని పోస్తూ ఎండిపోయిన వరిమొక్కలను తడుముతుంది.

మొదటి గలుమ కాశీరాంది. కాలువకు అడ్డంగా పెద్దకట్టగట్టిండు. నీళ్ళన్నీ కిందికి పోకుండా కాశీరాం చేనులోకే మర్లినయి.

"నాయ్యదొర... సూసినావు.,.. భూమ్మిద ఎవలు బతుకద్దు నేనే బతుకాలంటడు. కాలువ మొత్తం మర్రగట్టిండు. అక్కకు ఇలిటమచ్చి పాలుపోతదని చెల్లెను గూడా చేతవట్టిండు...' అనుకుంట కట్టను తెంపిండు లింగం. నీళ్ళు బుయ్యిమని కిందికి పారినయి.

రెండో గలుమ గౌరమ్మది. ఒక్క బొట్టు చేన్లకు దిగకుంట ఎవలో గలుమ కట్టింర్రు. 'పాపం... గౌరమ్మ... కుడుమంటే పండుగంటది. నోట్లె నాలికెలేదు. అప్పుల బాధకు మొగడు ఉరివెట్టుకసచ్చె. ఇద్దరాడివిల్లలతోని సతమతమైతుంది. ఎట్ల ఈదుకత్తవో తల్లి.... తిరుగవడితెనే ఇంటరు లోకం' అంటూ గలుమను తెంపి మడిలకు నీళ్ళను ఇడిసిండు.

మూడో గలుమ గోపాల్‌రెడ్డిది. పెద్దపెద్ద మడ్లు పన్నెండున్నయి. నాలుగెకరాల చేను. చిన్న చిన్న మడ్లుంటే అచ్చు కట్టి పెద్దమడ్లను చేసిండు. కాలువకంటే రెండు ఫీట్లే తక్కువుంది. ఏది అడ్డం పెట్టినా పెట్టకపోయినా కాలువల నీళ్ళన్నీ చేన్ల నిండుతయి. అయినా గలుమ రౌతుతో మెత్తి ఉంది. పక్కన చిన్న సందు. కొద్దిగ నీళ్ళు మడిలకు దిగి మిగిలినయి కాలువలకు పారి కిందికి పోతున్నయి.

"పటేలా... మునాసమంటే నీదే... ఇంట్ల బయిట ఒక్కమాట మీదుంటవు. ఈ పూటకుల్లోళ్లు రోజుకో మాట మాట్లాడినా నువ్వు నా దిక్కే ఉన్నవు. దొంగను గాదని నిజం చెప్పినవు. నీ కడుపు సల్లగుండ. నువ్వే లేకుంటే నన్ను ఇంకెంత ఆగంజేత్తురో...' అనుకుంట దరే సాబ్ గలుమ దగ్గరికచ్చిండు.

"ఊ.... పెద్దమనిషి గలుమజూడు... గలుమల కషికెడు మన్నులేదు. కాలువల కషికెడు మన్నులేదు. నీళ్ళే ఎటుపోవాలని పరిషానయి తున్నయి. పేరు పెద్దదేగని ఇల్లు జలజంత్రం. లగ్గమయిన బిడ్డ ఇంటి మీదుంది. ఓ కోడలు వత్తనే లేదు. ఊర్లె పంచాది చెప్పవోతడు' అనుకుని చేన్లమన్నును గలుమలకు మత్రనూకిండు.

మంగ మాటలన్నీ ఇనుకుంట ఊకొట్టుకుంట ఎంటనడుత్తంది.

బాల్‌రాజు గలుమ దగ్గరికచ్చి ఆగిపోయిండు లింగం. ఆపుకోలేనంత నవ్వచ్చింది లింగానికి. నవుతుంటే ఎందుకని మంగ అడిగింది. "బాల్‌రాజు నమ్మకం దక్కమనిషి. చెప్పిందే పదిసార్లు చెప్పుతుండె. పొద్దంత నాలుగుసార్లు తెల్లందాక నాలుగుసార్లు చేన్లకత్తుండె. వచ్చినప్పుడల్లా గలుమ తెంపుతుండె. వద్దు నేను పారిత్త గదా అన్నా వినకపోతుండె. నాకు యాష్టకచ్చింది. ఒకనాడు రాత్రి చేను దగ్గరకత్తండు. నేను చెట్టెక్కి కూసున్న దగ్గెరికి రాంగనే అగ్గిపుల్ల గీసి కొమ్మను అంటువెట్టి ముందట ఇసిరిన. ఇక జూసుకో కొడుకు. దోతి తడువంగ ఒకటే ఉరుకుడు. మల్లా గలుమ దగ్గెరికి రాలేదనుకో" అన్నడు.

మంగ కిలకిల నవ్వింది గలుమ గలుమకు గ్యాపకాలు గెలుక్కున్నరు.

ఇద్దరు ఆకిరి గలుమ దగ్గెరికచ్చి ఆగిపోయిండ్రు. లింగంకు కండ్లల్ల నీళ్ళు తిరిగినయి. 'వారీ... నర్సిగా... నా పొట్ట మీద గొట్టింది నువ్వేరా!... నీకు మొదాలు దన్నుదుకు నీళ్ళు ఎయ్యలేదని పగపట్టి వడ్ల దొంగతనం అంటగట్టి నీరటితనం తీసేత్తివి. నా బతుకును ఆగం జేత్తివి'అనుకుంట నర్సింలు పొలంలకు నీళ్ళు మత్రగట్టిండు.

ఐదెకరాల పొలం అది. నర్సింలు కొన్నడు. అతనికి టాక్టరున్నది. తనది ముందుగా నాటేసుకుంటే టాక్టర్ కిరాయి కొట్టచ్చునని ముందుగా తనపొలానికి నీళ్ళు ఎయ్యిమన్నడు. ఇప్పుడు కొత్తగాదు. .. చివరి గలుమ చివరనే అన్నడు లింగం. అండ్లనే పంచాది పుట్టింది.

ఇద్దరూ వచ్చి కాలువ ఒడ్డున కూసున్నరు. చుట్టూ గలగల సప్పుడు. ఆరిపోయిన పంటనేల మీద నీళ్ళు పారిన వాసన కొత్తగా ఉంది.

'వరి మొత్తం ఈనిందే.. పది పదిగేను రోజులైతే గడ్డకు పడుతది. రేపు ఎట్లాగూనేను బొంబాయి పోతున్న. నువ్వు మీ అవ్వగారింటికి పోతున్నవు. సూత్త సూత్త ఇన్ని రోజులు తిండివెట్టిన ఈ చేన్లు ఎండిపోతుంటే

తట్టుకోలేకపోయిన. రేపు బొంబాయి పోయినా ఈ ఎండిపోయిన పంటనే కండ్లల్ల కదులుతుండె' చెప్పిండు లింగం.

పనిలో పడి ఇద్దరూ చూసుకోలేదు గాని ఎప్పుడో నెలపొడుపు పొడిచింది. కాలువ నీళ్లల్ల కదలాడుతుంది. దోసిలి ఎత్తి నీళ్ళల్ల చందమామను చూపించిండు లింగం. చలిని గాయాల బాధను మరిచి కిలకిల నవ్వింది మంగ.

ఇద్దరూ ఇంటికి చేరుకున్నరు.

మాగన్ను మీదున్న ఊరు అప్పటికే నిద్రలేచింది. మంగ కలవరపడ్డది.

'తెల్లారితే ఎట్లనో బయటపడుతది. మనను ఉంచరు. పొట్టు పొట్టు గొడుతరు. వద్దు వద్దంటే ఇనక ఇంతదూరం తెత్తివి. రేపు అ నీరటికాడో పొలాల రైతులో గూడా అడ్డం రారు. మేము ఇడుపుమన్నమా అంటరు. దొంగ బతుకుజేత్తివి. తెల్లారక ముందే నువ్వు అటు బస్సెక్కు. నేను ఇటు బస్సెక్కుత" అంటూ ముల్లె నెత్తిమీద పెట్టింది మంగ.

పొద్దుపొడిచి బారెడెక్కింది. నాలెతూము నీళ్ళకు కాసువాగ పొలం మొత్తం పారింది. తడి తలుగగానే వాడిపోయిన కర్రలకు పాణమచ్చి పచ్చగ నవ్వుతున్నయి. ఈనిన గొలుకలు మెత్తగా కదులుతున్నయి. ఈ సంగతి ఊరంతా పాకింది. ఊరు పాలపొంగులా లేచింది.

నక్కి నక్కి పెద్ద గుట్ట ఎక్కి కాలువ ఒడ్డు నుంచి కాసువాగ చేనును చూసిండు లింగం. నిన్న మొన్న వాడిపోయిన కర్రెలకు చివరిగా పారిన పచ్చదనాన్ని కండ్లనిండా చూసిపోదామన్న ఆశ. గాలికి కదిలిన కర్రలన్నీ అతనికి పబ్బుతివట్టినయి. మడ్లన్నీ కలే చూసుకున్నడు. దిగిపోతూ ఎదురు బోరువైపు చూసిండు. విచిత్రమనిపించింది.

ఎదురుగా మంగ.

ఆమె కండ్లలోనూ అదే తపన.

వరికర్రలు ఎలా ఉన్నాయని!

● ఈవారం, జనవార్త - 3 ఫిబ్రవరి, 2008 ●